
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

మంగళవారం 1 జూలై 2025



మాట్లాడుతున్న డీఆర్వో సంగీత

పరిశ్రమల్లో ఫైర్‌సేఫ్టీ తప్పనిసరి

» జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

రంగారెడ్డి అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) పరిశ్రమలలో నిబంధనల మేరకు అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సంబంధిత అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరిశ్రమలు, అగ్నిమాపక, పోలీసు శాఖలతో పాటు పరిశ్రమల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమలలో మౌలిక సదుపాయాలు, ఫైర్‌సేఫ్టీ ఉండాలన్నారు. పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పరిశ్రమలలో ఫైర్‌సేఫ్టీ ఉందో లేదో తెలుసుకునేందుకు ఆకస్మిక తనిఖీలు చేయడంతో పాటు పనితీరును తెలుసుకోవాలన్నారు. అదే విధంగా ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ చేపట్టి, ఇందులో స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఫైర్‌సేఫ్టీ, పొల్యూషన్ కంట్రోల్ తప్పకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి అధికారి యాదయ్య, జిల్లా అగ్నిమాపశాఖ అధికారి మురళీ మనోహర్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఔటర్‌పై రోడ్డు ప్రమాదం

9 కార్లు ఒకదానికొకటి ఢీ

ప్రయాణికులకు స్వల్ప గాయాలు

భారీగా ట్రాఫిక్ జామ్





శంషాబాద్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఔటర్ రింగ్ రోడ్డుపై 9 కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఔటర్ రింగ్ రోడ్డు కోత్వాల్‌గూడ చెన్నమ్మ హోటల్ సమీపంలోకి రాగానే ఎయిర్‌పోర్టు నుంచి గచ్చిబౌలి వెళ్తున్న ఒక కారు డ్రైవర్ అతివేగంగా వెళ్తూ సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల ఉన్న ఉన్న 9కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో 9 కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి, అందులో ప్రయాణికులకు స్వల్ప గాయలయ్యాయి. రోడ్డుపై వాహనాలు ఢీకొనడంతో ఔటర్‌పై దాదాపు 2 కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఔటర్‌రింగ్ రోడ్డు సిబ్బంది, స్థానిక పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అయితే పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు.

అన్నదాతకు సాగు మొదలు నుంచి పంట అమ్మకం వరకు అన్నీ కష్టాలే. వ్యయ ప్రయాసలకోర్చి ఈ ఏడాది వానాకాలం సాగు పనులు మొదలెడితే ఎరువు బరువుగా మారింది. ఓ వైపు ధర పెరిగి భారంగా మారితే.. మరోవైపు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన డీఏపీని బ్లాక్ మార్కెట్‌కు తరలించి స్టాక్ లేదంటున్నారు. ధరలు పెంచి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు డీలర్లు చెప్పిన ధరకే డీఏపీ, యూరియాను కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. అంతేకాకుండా కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటూ మెలిక పెడుతున్నారు.



ఎరువు.. బరువు!

10వేల మెట్రిక్ టన్నులు అవసరం

ఇప్పటికీ 2,707.45 టన్నులు సరఫరా

నిల్వ ఉన్న స్టాక్ 1,045 టన్నులే..

మార్క్‌ఫెడ్‌లో డీఏపీ 11 టన్నులు

మిగతా ప్రొడక్ట్ జీరో స్టాక్

ఈ ఏడాది ఎరువుల ధరలు పెంపు

కృత్రిమ కొరత సృష్టిస్తున్న ప్రైవేట్ డీలర్లు

అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీ

కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా

పట్టించుకోని వ్యవసాయ అధికారులు



వేధిస్తున్న కొరత.. పెరిగిన ధరలు

రంగారెడ్డి అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌లో ఎరువుల ధర పెరగడంతో రైతులకు గుదిబండగా మారింది. ఎన్నో ఆశలతో సాగుకు సన్నద్ధమైతే ఎరువుల కొరత, పెరిగిన ధరలు అన్నదాతల నడ్డి విరుస్తున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలోనే కంపెనీలు ఎరువుల ధరలు పెంచడంతో జిల్లా రైతులపై కోట్లలో అదనపు భారం పడింది. డీఏపీ ధర గణనీయంగా పెరిగింది. ఏకంగా బస్తాకు రూ.200 పెంచింది. ఎక్కువగా వినియోగించే మిశ్రమ ఎరువుల ధరలు ఆకాశాన్నంటాయి. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని డీలర్లు మెలిక పెడుతున్నారు.

యాసంగి సీజన్‌తో పోలిస్తే వానాకాలం సీజన్‌లో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఎకరాకు నాలుగు బస్తాల వరకు, రెండు మూడు రకాల కాంప్లెక్స్ ఎరువులు, రెండు బస్తాల యూరియా, అర బస్తా వరకు పొటాష్ వినియోగిస్తుంటారు. జిల్లాలో 3,47989 ఎకరాల్లో వానాకాలం సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఈ సీజన్‌లో 43,917 క్వింటాళ్ల విత్తనాలు, 67,200 టన్నుల ఎరువులు

మిగతా 8వ పేజీలో...

ధరల వివరాలు (రూపాయల్లో)

రకం	2024	2025	పెరుగుదల
యూరియా	220	265	45
డీఏపీ	1,150	1,350	200
ఎస్ఎస్‌పీ	450	550	100
ఎంవోపీ	1,350	1,550	200
కాంప్లెక్స్	1,700	1,800	100

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

ప్రొడక్ట్	మార్క్‌ఫెడ్	సొసైటీల్లో	ప్రైవేట్ డీలర్స్	జిల్లా మొత్తం
యూరియా	3155	1,664	1,402	6,222
డీఏపీ	11	235	799	1,045
ఎంవోపీ	0	17	218	235
ఎస్ఎస్‌పీ	0	22	226	248
కాంప్లెక్స్	0	682	4,802	5,649
మొత్తం	3,331	2,621	7,447	13,399

ప్రైవేట్ క్లినిక్‌ల తనిఖీ

షాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): షాబాద్‌లోని ప్రైవేట్ క్లినిక్‌లను సోమవారం తెలంగాణ వైద్య మండలి సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆర్ఎంపీలు రోగులకు చేస్తున్న వైద్యం, అందిస్తున్న మందుల గురించి ఆరా తీశారు. అర్హత లేకున్నా ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లినిక్ నిర్వాహకుల ఆధార్ కార్డు కాపీని, రోగులకు వారు ఇస్తున్న ఇంజక్షన్లు, మందుల శాంపిళ్లను టీఎంసీ సభ్యులు తీసుకెళ్లారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పారిశుధ్యంపై దృష్టిసారించాలి

ఎంపీడీవోలకు కలెక్టర్ ఆదేశాలు

యాచారం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని డీఎల్‌పీవో, ఎంపీడీవో, ఎంపీవోలకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై మురుగు నిలవకుండా చూడాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. చెత్తకుప్పలు లేకుండా చూసుకోవాలన్నారు. తాగునీటి పైప్‌లైన్లు లీకవ్వకుండా చూడాలని, నీటిని కాచి వడబోసిన తర్వాతే తాగాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టాలన్నారు. మురుగు కాల్వల్లో ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ చల్లించాలని ఆదేశించారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను విధిగా శుభ్రం చేయించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉపాధ్యాయులకు తీపి కబురు చెప్పింది. నియామకమై నాలుగు నెలలైనా ఇంత వరకు వేతనాలకు నోచుకోలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం వేతనాలు విడుదల చేసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 201 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులున్నారు. వీరి కోసం రూ. 8.40 కోట్లు కేటాయించారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్ట్ టీచర్లకు తీపి కబురు

వేతనాలకు రూ. 8.40 కోట్లు మంజూరు

జిల్లా	కాంట్రాక్ట్ టీచర్లు	నిధులు
రంగారెడ్డి	92	రూ.3.84 కోట్లు
వికారాబాద్	90	రూ.3.76కోట్లు
మేడ్చల్	19	రూ.79.40లక్షలు



ఉమ్మడి జిల్లాలో 201 మందికి లబ్ధి

ఒకేసారి అందుకోనున్న నాలుగు నెలల వేతనం

హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఫిబ్రవరి 14 వ తేదీన నియామకం

రంగారెడ్డి అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వారికి వేతనాలను మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ జూన్ 26న ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ జిల్లాకు రూ.3,76,13,700, రంగారెడ్డి జిల్లాకు రూ.3,84,49,700, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు రూ.79,40,700 చొప్పున బడ్జెట్ కేటాయించారు.

గత ఫిబ్రవరిలో నియామక పత్రాలు

ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్సీ-2008 నియామకాల్లో అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో

మిగతా 7వ పేజీలో...

నెలనెలా వేతనాలు చెల్లించాలి



ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కాంట్రాక్టు ఉపాధ్యాయులకూ నెలనెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలి. వేతనంపైనే ఆధారపడే వారికి వేతనాలు పెండింగ్‌లో ఉంచకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. సకాలంలో వేతనాలు అందేలా అధికారులు సైతం చర్యలు తీసుకోవాలి. పెండింగ్ వేతనాలు విడుదల చేయడం పట్ల ఎస్టీయూ పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

- ప్రవీణ్‌కుమార్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

10కిలోల గంజాయి పట్టివేత



శంకర్‌పల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల పోలీసులు 10కిలోల గంజాయిని పట్టుకున్నారు. డిటెక్టివ్ సీఐ సమరంరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మీర్జాగూడ పరిధిలోని ఇంద్రారెడ్డి ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 10కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ముగ్గురు నిందితులు శంకర్ గౌడ్, శ్రీధర్ పరిడా, మినీ నహక్‌లు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. వీరు నగరంలో నివాసముంటూ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా నిందితులు కార్మికులు నివాసముండే ప్రాంతాలలో గంజాయిని విక్రయించేందుకు ఒడిశా నుంచి తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు డిటెక్టివ్ సీఐ వివరించారు.

ప్రజావాణికి 73 ఫిర్యాదులు



సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి 73 ఫిర్యాదులు అందాయి. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖ నుంచి 32 రాగా, ఇతర శాఖల నుంచి 41 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, పాల్గొన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు తక్షణమే రుణం మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. జగన్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు వినతి పత్రం సమర్పించారు. ఎలాంటి షరతులు లేకుండా లబ్ధిదారులకు రుణం ఇవ్వాలని ఆయన కోరారు.

సారూ.. తిరగలేక పోతున్న

మాది ఇబ్రహీంపట్నం మండలం నెర్రవల్లి గ్రామం. సర్వేనెంబర్ 228లో ఆరున్నర ఎకరాల భూమి ఉంది. ధరణి వచ్చాక పట్టా భూమి కాస్త భూదాన్‌గా పడింది. స్థానిక తహసీల్దారు, ఆర్డీవోను కలిశాను. అక్కడ సమస్య పరిష్కారం కాలేదు. కలెక్టరేట్‌కు పలు మార్లు వచ్చాను. ప్రజావాణిలో ఇప్పటికే ఐదు సార్లు అధికారులను కలిశాను. కలిసినప్పుడల్లా నీ సమస్య అయిపోయింది.. మీ సేవకు వెళ్లి చూసుకుపో అంటున్నారు. అక్కడకు వెళ్లితే సమస్య అలాగే ఉంటుంది. నాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరి పెళ్లిళ్లు చేశాను. మనువలు, మనుమరాళ్లతో హాయిగా గడిపాల్సిన ఈ వయస్సులో ఆఫీసుల చుట్టూ తిరగలేకపోతున్న. నేను బతికి ఉండగానే పిల్లలకు భూమి పంచి ఇవ్వాలనుకుంటున్నాను... అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.

- గుడ్ల సాయిలు, నెర్రవల్లి గ్రామం

ఓపెన్‌గా ఆరోగ్యం

» రూ.26 లక్షలతో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు

» నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి



8



దీక్షలో ఉద్యమకారులు

ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

శంకర్‌పల్లి, జూన్30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం శంకర్‌పల్లి చౌరస్తా వద్ద దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడు దేశమొల్ల అంజనేయులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 250గజాల ఇంటిస్థలం ఇస్తామని మేనిఫెస్టోలో పొందుపర్చారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. బీజేపీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి. అశోక్, పండిత్‌రావు, మాణయ్య, శ్రీనివాస్, వీరారెడ్డి, పద్మ, గౌరి, మంజుల ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగితే వృద్ధిలోకి కుటుంబాలు



మాట్లాడుతున్న సీఈవో సంగీత

ఇబ్రహీంపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు వృద్ధిలోకి వస్తాయని, ఆ దిశగా చైతన్యం తీసుకురావాలని ఇబ్రహీంపట్నం ఓం ప్రగతి పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మెట్టు అశోక్‌రెడ్డి, సీఈవో టి.సంగీత అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవీ గార్డెన్స్‌లో ఓం ప్రగతి మ్యాక్స్ 13వ వార్షిక మహాసభలో వారు మాట్లాడారు. సంఘ సభ్యుల సహకారంతో రూ.80 కోట్ల లావాదేవీలతో ఈ మ్యాక్స్ విజయవంతంగా నడుస్తోందన్నారు. రూ.6.52 కోట్లు అప్పుల రూపేణ సంఘాలకు అందజేసినట్లు తెలిపారు. 68 సంఘాలతో 22,039 మంది సభ్యులతో నడుస్తున్న ఈ మ్యాక్స్‌లో మహిళలు పొదుపు చేసుకుంటూనే వ్యవసాయ అనుబంధ, ఇతర వ్యాపారాల కోసం అప్పులు తీసుకుని తిరిగి చెల్లిస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారన్నారు. సంవత్సర కాలంలో మరణించిన 48 సంఘ సభ్యుల కుటుంబాలకు రూ.33.84 లక్షలు విపత్తు సహాయం అందజేసినట్లు వారు తెలిపారు. తమ సమాఖ్య ద్వారా సభ్యులకు ఇళ్ల నిర్మాణానికి రుణాలు కూడా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ కార్యాలయ అధికారి రవికుమార్, మ్యాక్స్ ఉపాధ్యక్షురాలు నెల్లూరి నాగరాణి, పాలకవర్గ సభ్యులు కె.లింగమయ్య, అరుణ, పర్వీన్, అరుంధతి, పద్మ, లలిత, వెంకటాచారి, అకౌంటెంట్ డి.వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ వి.స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నిరంతరం విద్యుత్ అందించాలి

ఆమనగల్లు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సేనావత్ పత్యానాయక్ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. గాలి, వర్షం వస్తే పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, దీంతో గంటల తరబడి అంధకారంలో ఉండాల్సి వస్తోందని వాపోయారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, నాయకులు గుత్తి బాలస్వామి, శ్రీను నాయక్, వెంకటయ్య, రమేశ్‌నాయక్, సైదులు గౌడ్, మల్యానాయక్, కృష్ణవేణినాయక్, శ్రీకాంత్ నాయక్, భాస్కర్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.

సీఎన్జీ బైక్‌ల సందడి

- పెరుగుతున్న గ్యాస్ బైక్‌ల కొనుగోళ్లు
- ప్రస్తుతం కిలో సీఎన్జీ రూ.95, వంద కిలో మీటర్ల ప్రయాణం
- కాలుష్య రహిత వాహనాలపై జనం ఆసక్తి
- తగినన్ని గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు లేక సీఎన్జీ వాహనదారుల ఇబ్బందులు


సీఎన్జీ బైక్‌లో గ్యాస్‌ను నింపించుకుంటున్న యువకుడు

ఘట్‌కేసర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పెట్రోల్, ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు సీఎన్జీ(కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్)తో నడిచే ద్విచక్ర వాహనాలు సైతం రోడ్లపై సందడి చేస్తున్నాయి. పెట్రోల్‌తో నడిచే బైక్‌లు, కొంతకాలంగా ఎలక్ట్రిక్ వాహనాలు పెరిగిపోతున్న విషయం అందరికీ తెలిసిందే. ఇదే జాబితాలో సీఎన్జీ బైక్‌లు సైతం రోడ్లపై దూసుకుపోతున్నాయి. ఇప్పటి వరకు సీఎన్జీతో కార్లు, మరికొన్ని రకాల ఫోర్ వీలర్లు, ఆటోలు పెద్దఎత్తున తిరుగుతన్నాయి. ఇప్పుడిప్పుడే గ్యాస్‌తో నడిచే బైక్‌లను సైతం వాహన ఉత్పత్తిదారులు మార్కెట్లలోకి విడుదల చేస్తున్నారు. ఈ బైక్‌లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఘట్‌కేసర్‌లోని హైవే పక్కన గల మైసమ్మగుట్ట గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌కు గ్యాస్ ఫిల్‌చేసుకునేందుకు వచ్చిన ద్విచక్ర వాహనదారుడు సురేశ్‌ను స్థానికులు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సురేశ్ స్పందిస్తూ తాను 1.3లక్షలకు సీఎన్జీ బైక్‌ను కొన్నట్టు చెప్పాడు. రూ.95కు కిలో గ్యాస్ రేటు ఉందని, ఒక కిలో నింపిస్తే తన బైక్ వంద కిలోమీటర్లు నడుస్తుందని తెలిపాడు. కాలుష్య సమస్యలు, శబ్దం లేకుండా బైక్ నడుస్తుందన్నాడు. తన వాహన సిలిండర్ సామర్థ్యం 3కిలోలని, ఒక్కసారి సీఎన్జీ నింపితే 300కిలోమీటర్లు ప్రయాణించొచ్చని వివరించాడు. తన వాహనానికి గ్యాస్ ట్యాంకుతోపాటు పెట్రోల్ ట్యాంక్ కూడా ఉంటుందని, గ్యాస్ దొరకని పక్షంలో పెట్రోల్ సైతం పోయించుకునే వీలుందని చెప్పాడు. కాకుంటే పెరుగుతున్న సీఎన్జీ వాహనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మరిన్ని సీఎన్జీ స్టేషన్లను ఏర్పాటు చేయాలని అన్నాడు. రానురాను ఎలక్ట్రిక్‌తో పాటు సీఎన్జీ వాహనాల సంఖ్య సైతం గణనీయంగా పెరుగుతుందని, సంప్రదాయ ఇంధనాలైన పెట్రోల్, డీజిల్‌ల వినియోగం తగ్గుతుందని అభిప్రాయపడ్డాడు. హైదరాబాద్, నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు తక్కువగా ఉండడంతో ఫిల్లింగ్ కోసం వాహనాలు బారులుతీరుతున్నాయి. వాహన కాలుష్యం తగ్గాలంటే గ్యాస్, ఎలక్ట్రిక్ వాహనాలు పెరగాలని, అలాగే గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ల సంఖ్యనూ భారీగా పెంచాలని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

తక్కువ ఖర్చుతో ప్రయాణం



సీఎన్‌జీ గ్యాస్ వాహనాలతో ఆర్థికంగా ప్రయోజనం ఉంటుంది. పెట్రోల్‌తో పోలిస్తే 40శాతం నుంచి 50శాతం తక్కువ ఖర్చుతో వాహనాన్ని నడపొచ్చు. వాహన కాలుష్యం కూడా బాగా తక్కువ. పొగ అనేదే రాదు. అయితే గ్యాస్ కోసం క్యూలో నిలబడాల్సి వస్తోంది. అవసరమైనన్ని గ్యాస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమైతుంది. సీఎన్జీ అంతటా అందుబాటులో ఉంటే పెట్రోల్, డీజిల్ వాహనాల బదులు ఎక్కువ మంది గ్యాస్‌తో నడిచే వాహనాలనే కొనే అవకాశముంది. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

- సురేశ్, సీఎన్జీ బైక్ ఓనర్, ఘట్‌కేసర్

డిమాండ్‌కు సరిపడా సీఎన్జీ సరఫరా లేదు



పర్యావరణంపై ప్రజలకు అవగాహన పెరుగుతండటంతో సీఎన్‌జీ వాహనాల సంఖ్య పెరుగుతోంది. డిమాండ్‌కు సరిపడా గ్యాస్ సరాఫరా కావడంలేదు. రోజులో సగం దినం విక్రయంతో సీఎన్జీ అయిపోతోంది. మిగతా రోజంతా ఖాళీగా ఉంటున్నాం. సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు సీఎన్జీ ఉత్పత్తిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాయి.

- సందుపట్ల జీవన్‌రెడ్డి, సీఎన్జీ స్టేషన్ యజమాని, ఘట్‌కేసర్

మీడియా సంస్థలపై దాడులను సహించం

● ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో కీలకపాత్ర పోషిస్తున్న మీడియా సంస్థలపై దాడులను సహించబోమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. మరో మూడు మీడియా సంస్థలపై దాడులుచేస్తామని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అనడం సిగ్గుచేటన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు చేసిన అన్యాయాలు, అక్రమాల గురించి మీడియా సంస్థలు ప్రసారం చేయడం, ప్రచురించడాన్ని జీర్ణించుకోలేని ఆ పార్టీ అగ్ర నాయకులు దాడులకు ఉసి గొల్పుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ చేసిన ఉద్యమాలతోనే తెలంగాణ రాష్ట్రం రాలేదని, యువత బలిదానాలు, మీడియా సహకారంతోనే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. ఉద్యమంలో మీడియా లేకుంటే రాష్ట్రం ఆవిర్భవించేదా? అన్న విషయాన్ని కల్వకుంట్ల కుటుంబం గుర్తించాలన్నారు. రాష్ట్రంలోని మీడియా సంస్థలకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. జగదీశ్వర్‌రెడ్డి తస్మాత్ జాగ్రత్త అని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. పౌర స్వేచ్ఛను హరిస్తూ ఫోన్లు ట్యాపింగ్ చేసి, మీదికెలి సిగ్గులేకుండా దాడులు చేస్తామని అంటావా? నీకు రోజులు దగ్గరపడ్డాయి. ఇంకోసారి మీడియా మీద మాట్లాడితే నాలుక కోస్త జాగ్రత్త. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి, బండి సంజయ్, కోదండరాంలపై పోలీసులతో దాడుల చేయిస్తే ఆ పార్టీల కార్యకర్తలు తిరగబడ్డారా? అని ప్రశ్నించారు. పత్రికలు, చానళ్లలో తప్పుడు వార్తలు, కథనాలు వస్తే వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలేగానీ దాడులు సమంజసం కాదన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, అగ్గనూరు విశ్వం, బాలరాజు, చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. 14వ వార్డులో సీసీ రోడ్డు పనులను, కమ్యూనిటీ హాలు, ఫరూఖ్‌నగర్ ప్రధాన సీసీ రోడ్డు, 22వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మాజీ కౌన్సిలర్ విజయ్‌కుమార్ కోరిక మేరకు విజయనగర్ కాలనీ పార్క్‌కు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కాలనీల్లో ఉప్పల వెంకటేశ్వం తదితరుల ఇళ్లకు వెళ్లి కలిశారు. మునిసిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతానని, అందుకు ప్రజల సహకారం అవసరం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, కాంగ్రెస్ నాయకులు జి.బాల్‌రాజ్‌గౌడ్, అగ్గనూరి బస్వం, జమ్రుద్‌ఖాన్, ఇబ్రహీం, రాజేందర్‌రెడ్డి, మోహన్, సరితయాదగిరి,అర్జున్, లక్ష్మణ్, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ హార్వెస్టింగ్ నిర్వహణకు తోడ్పాటు


సీజీఆర్ సంస్థ ప్రతినిధులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శంషాబాద్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ పర్యావరణ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'యంగ్ ఎర్త్ లీడర్' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పీఎం శ్రీ టీజీఎంఎస్ పాల్మాకుల పాఠశాలలో సీజీఆర్ సంస్థ రంగారెడ్డి జిల్లా కో-ఆర్డినేటర్ రజనీకాంత్ బేస్‌లైన్ సర్వే నిర్వహించారు. వివరాలను ప్రిన్సిపాల్ రజనికుమారి నుంచి నమోదు చేసుకున్నారు. రజనికుమారి మాట్లాడుతూ.. పాఠశాలలో హార్వెస్టింగ్, పీట్, కంపోస్టు పీట్, నో ప్లాస్టిక్ జోన్, డిక్లరేషన్ ఆఫ్ మదర్ ట్రీ, కిచెన్ గార్డెన్, సాయిల్ అండ్ సీడ్ మ్యూజియం, సోలార్ ఎనర్జీ వంటి కార్యక్రమాల నిర్వహణకు తోడ్పాటును అందిస్తున్న సీజీఆర్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, రవీందర్‌రెడ్డి, విద్యార్థులు ఆకాంక్ష, వైష్ణవి, శ్వేత, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ జిల్లా గవర్నర్‌గా నేడు బాధ్యతలు చేపట్టనున్న మహేంద్రకుమార్‌రెడ్డి



కందుకూరు, జూన్30(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్-320ఎ జిల్లా గవర్నర్‌గా డాక్టర్ జి.మహేంద్ర కుమార్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు తీసుకోనున్నారు. 2007-08లో లయన్స్ క్లబ్ ఆఫ్ కందుకూరు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎన్నికై, భూలక్ష్మీ మెమోరియల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్న మహేంద్రకుమార్‌రెడ్డి క్లబ్‌లో జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ క్లబ్ ఆధ్వర్యంలో మండలాలు, మున్సిపాలిటీల్లో 90క్లబ్‌లు ఉన్నాయని మహేంద్రకుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల్ జిల్లాలతో పాటు పాత నైజాం ప్రాంతంలోని కల్యాణ కర్ణాటక క్లబ్‌లు, రాయచూర్, సేడం, గుల్బర్గా, యాద్గిర్, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో క్లబ్‌లు ఉంటాయని, వీటిల్లో 3,500మంది సభ్యులున్నట్లు తెలిపారు. తనను జిల్లా గవర్నర్‌గా నియమించేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

హెలెన్ కెల్లర్ సేవా వారోత్సవాలు

జులై 1న తాను జిల్లా గవర్నర్‌గా బాధ్యతల స్వీకరణ సందర్భంగా 1 నుంచి 8వ తేదీ వరకు హెలెన్ కెల్లర్ సేవా వారోత్సవాలు అన్ని క్లబ్‌లలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. కంటి వైద్యశిబిరాలు, కాటరాక్ట్ ఆపరేషన్లు, రక్తదాన, డయాబెటిక్ నిర్ధారణ శిబిరాలు, స్కూల్ విద్యార్థులకు స్టేషనరీ అందజేత వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్దపీట


స్వయం ఉపాది పథకాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ


కడ్తాల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యువత ఉపాధి, ఉద్యోగాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్ అన్నారు. అధికారంలోకి వచ్చిన 18నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 60వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని పేర్కొన్నారు. కడ్తాల్లో రాకేశ్ ఏర్పాటుచేసిన స్వయం ఉపాధి పథకాన్ని సోమవారం వారు ప్రారంభించారు. యువత స్వయం ఉపాధి పథకాలు చేపట్టి మరి కొందరికి ఉపాధి కల్పించాలని సూచించారు. ఉపాధి శిక్షణకు ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి బిక్యానాయక్, జిల్లా నాయకుడు వెంకటేశ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, రాజు, పాండు, జహంగీర్‌అలీ, శ్రీను, సురేశ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్

తాండూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకుందామని సమితి జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి మల్లికార్జున్ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అధ్యక్షుడిగా 30ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందన్నారు. వర్గీకరణకు సహకరించిన రాజకీయ పార్టీలకు ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందన్నారు. ఆవిర్భావ దినోత్సవాన గ్రామాల్లో జెండా దిమ్మెలు నిర్మించి జెండా ఎగరవేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జగదీష్, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణ, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ, మండలాధ్యక్షుడు సూర్య ప్రకాశ్, పెద్దేముల్ మండలాధ్యక్షుడు ఉమాశంకర్, టౌన్ ప్రెసిడెంట్ బలరాం, రవికుమార్, ఎంఎస్ఎఫ్ కన్వీనర్, కార్యదర్శి పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎదులాబాద్‌లోని సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. పదిరోజులుగా సాగిన 'బాయ్స్ ఫర్ చెయింజ్' ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఉత్తమ పౌరులుగా ఎదిగి స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో బాయ్స్ ఫర్ చెయింజ్ కార్యక్రమం నిర్వాహకుడు క్రిస్టఫర్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు


అహ్మద్‌గూడలో డ్రగ్స్‌పై అవగహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

కీసర, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిస కావొద్దని కీసర పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాస్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో ఓ ప్రైవేట్ పాఠశాలలో సోమవారం డ్రగ్స్‌పై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల తల్లిదండ్రులు వారి నడవడిక, ప్రవర్తలన పట్ల నిత్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. యువత, విద్యార్థులు వ్యసనాల బారినపడకుండా, చదువుపై దృష్టి సారించేలా సమాజంలోని ప్రతి ఒక్కరు కృషిచేయాలని సీఐ కోరారు.

నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలి

చౌదరిగూడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వనంపల్లి వన నర్సరీని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసే సమయాల్లో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో టీఏలు లక్ష్మారెడ్డి, వినోద్, దేవేజీ, పంచాయతీ కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ టీచర్లకు తీపి కబురు

(ఐదో పేజీ తరువాయి)

మంచి మార్కులు సాధించి మెరిట్ జాబితాలో తమ పేర్లు ఉన్నా.. డీఈడీ లేకుండా బీఈడీ అర్హతలు ఉన్న అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలకు దూరమైన విషయం తెలిసిందే. ఆ డీఎస్సీలో ఎంపికైన ఎస్‌జీటీ అభ్యర్థుల్లో డీఈడీ అర్హతలు ఉన్న అభ్యర్థులకే ఎస్‌జీటీ ఉద్యోగాలు కల్పించడంతో మెరిట్ జాబితాలో ముందున్నా.. బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమయ్యారు. మెరిట్ జాబితాలో ఎంపికైన తమకు ఉద్యోగాల్లో నియమించాలని డిమాండ్ చేస్తూ నష్టపోయిన అభ్యర్థులు న్యాయ పోరాటానికి దిగారు. అప్పటి నుంచి ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇస్తూ తమకు న్యాయం చేయాలని వేడుకున్న విషయం తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారికి న్యాయం చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మెరిట్ జాబితాలో ఉండి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులను కాంట్రాక్టు విధానంలో ఎస్‌జీటీలుగా నియమిస్తూ గత ఫిబ్రవరి 14న నియామక పత్రాలు అందజేశారు.

అందని తొలి వేతనం

ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి ఎస్‌జీటీలుగా విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు వేతనాలు మంజూరు కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు విధులు నిర్వహించగా.. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పునఃప్రారంభమైన జూన్ 12 నుంచి కాంట్రాక్టు ఎస్‌జీటీ ఉపాధ్యాయులు తమ విధులకు హాజరవుతున్నారు. ఎట్టకేలకు వారి వేతనాల కోసం బడ్జెట్ విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపు బాధ్యతలను కలెక్టర్, డీఈవోలకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్తర్వులు జారీ అయ్యాయి



కాంట్రాక్టు ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ వేతనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. త్వరలో ఆ ఉపాధ్యాయులకు వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం.

- రేణుకాదేవి, డీఈవో, వికారాబాద్

సౌభాగ్యానికి చిహ్నం గోరింటాకు

ఆషాఢంలో మహిళల మైదాకు ఉత్సవాలు

- పల్లె, పట్టణ ప్రాంతాల్లో మెహందీ వేడుకలు
- గోరింటాకును శుభ సూచికంగా భావించే మహిళలు



మహిళల చేతిలో గోరింటాకు

వికారాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ఆరంభంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆషాఢ సంబరాలు మొదలయ్యాయి. ఈ మాసంలో మహిళలు అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తారు. చేతికి గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీ. గోరింటాకు పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారు. పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా గోరింటాకు, బోనాల జాతరలు మొదలయ్యాయి. నోము రోజు ఉదయం ఉపవాసం ఆచరిస్తూ, సాయంత్రం గోరింటాకు పెట్టుకోవడం ఇక్కడి మహిళల ఆనవాయితీ.



గోరింటలో ఔషధ గుణాలు

పూజలకు ప్రత్యేకం.. ఆషాఢం

ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు విష్ణు భగవానుడు పాలకడలిపై యోగ నిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా ఆచరిస్తారు. శుద్ధ పౌర్ణమినాడు గురుపౌర్ణమిగా వ్యవహరిస్తారు. భాగవతాన్ని రచించిన వేద వ్యాసుడు జన్మించిన రోజును వ్యాసపౌర్ణమి అంటారు. ఈ మాసంలో ఆడవారు ఒక్కసారైనా గోరింటాకు పెట్టుకుంటారు. ఆహారంలో మునగకాయను వాడతారు. శుద్ధ ఏకాదశినే మహా ఏకాదశి అని కూడా అంటారు. జనసామ్యంలో తొలి ఏకాదశి అంటారు. ఇంద్రియ నిగ్రహానికి ఆహార నియమాలు తీసుకుంటూ పూజలు, వ్రతాలతో దంపతులు బ్రహ్మచర్యాన్ని పాటిస్తారు. ఇదే నెలలో ఊరూరా గ్రామ దేవతలకు బోనాల పండుగను నిర్వహిస్తారు.

గోరింటాకు పెట్టుకోవడం సౌభాగ్యానికి, శ్రేయస్సుకు సంకేతంగా మహిళలు భావిస్తారు. చేతులు, కాళ్లకు గోరింటాకు కొత్త అందాన్నిస్తుంది. గోరింట ఎంత ఎర్రగా పండితే.. అంత మంచి భర్త వస్తాడని యువతుల నమ్మిక. శుభానికి చిహ్నంగానూ గోరింటాకును భావిస్తారు. శరీర వేడిని తగ్గించేందుకు గోరింటాకు దోహదం చేస్తుంది. మనిషి రోగ నిరోధక శక్తిని పెంచుతుది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. తరచూ గోరింటాకు తప్పక పెట్టుకోవాలని వైద్యులు సైతం సలహా ఇస్తున్నారు. పెళ్లి, ఇతర శుభకార్యాలు, పండగలప్పుడు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీ. గోరింటాకును స్త్రీలు సౌభాగ్యానికి చిహ్నంగా భావిస్తారు. పట్టణాల్లో మహిళలు సమూహంగా కూర్చొని గోరింటాకు పెట్టుకుంటారు.

అలంకరణకే కాదు.. ఆరోగ్యానికీ మేలే



గోరింటాకు అలంకరణకే కాకుండా ఆర్యోగానికి కూడా ఉపకరిస్తుంది. ఇంట్లో ప్రతి శుభకార్యానికి గోరింటాకు తప్పక వాడుతారు. వేసవి కాలం తరువాత వాతావరణంలో మార్పులకు అనుగుణంగా శరీరంలో ఉన్న వేడిని నియంత్రించి ఆరోగ్యాన్ని కాపాడడంలో గోరింట పాత్రపోషిస్తుంది.

- శిరీష, బీజేపీ పట్టణాధ్యక్షురాలు, వికారాబాద్

నోముల మాసం.. ఆషాఢం



పవిత్ర మాసం ఆషాఢంలో అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తారు. ఆడపడుచులు నోములతో పాటు పూరి జగన్నాథ రథ యాత్రను జరుపుకుంటాం. ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం ప్రత్యేకం. వాతావరణ మార్పుల నుంచి రక్షించుకోవడం, ఆడవారి చేతులు అందంగా కన్పించేందుకు గోరింటాకును అలంకరించుకుంటారు.

- మంజుల, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్, వికారాబాద్

చేవెళ్ల కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జిగా అనంతకిషన్

సంగారెడ్డి టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా తోపాజి అనంతకిషన్ నియమితులయ్యారు. సంగారెడ్డికి చెందిన అనంతకిషన్‌ను చేవెళ్ల ఇన్‌చార్జిగా నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు ఎం.మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో చేవెళ్ల ఇన్‌చార్జిగా నియమించిన ఎం.మహేశ్‌కుమార్‌గౌడ్‌కు, అందుకు సహకరించిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జయప్రకాశ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



బాలేశ్వరయ్య దంపతులను సన్మానిస్తున్న మహేందర్‌రెడ్డి, ఎంఈవో తదితరులు

మోమిన్‌పేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తీర్చిదిద్ది భావి పౌరులుగా తయారు చేసే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మోమిన్‌పేట్ జెడ్పీ బాలుర పాఠశాలలో మహ్మద్ షఫీ, వెల్చాల్ జెడ్పీ పాఠశాల హెచ్ఎం బాలేశ్వరయ్యల రిటైర్మెంట్ సందర్భంగా ఎంఈవో మల్లేశంతో కలిసి సన్మానించారు. టీచర్లు శ్రీనివాస్‌రెడ్డి, గౌరీశంకర్, ప్రభు, అరుణ్‌కుమార్, మల్లేశం, సమ్మయ్య, రమేశ్, నాగేశ్వర్, జ్యోతి, మధుకర్, నీలాంబిక, మహేశ్ పాల్గొన్నారు.

చెత్త ఏరే చేతులకు పలకా బలపం

- వీధి బాలలను బడిలో చేర్పించిన ఎమ్మెల్యే
- పాఠశాల నిర్మాణానికి హామీ
- పిల్లలకు డ్రెస్సులు, పుస్తకాల అందజేత



ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ వీధుల్లో భిక్షాటన చేస్తూ, చెత్త ఏరుకునే చిన్నారుల చేతులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పలక బలపం పట్టించారు. బాలబాలికలను ఎమ్మెల్యే స్వయంగా ఆటోలో తీసుకెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని సిండికేట్ కాలనీలో సంచార దేవర జాతివారు కొన్ని సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకుని జీవనం గడుపుతున్నారు. పట్టణ వీధుల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తూ, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు, ఇనుప ముక్కలు, అట్టలను ఏరుకుని జీవనం గడుపుతున్నారు. వారి పిల్లలను బడికి పంపకుండా వెంట తిప్పుకుంటూ భిక్షాటన చేయిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకుని ఫరూఖ్‌నగర్ ఎంఈవో మనోహర్ పాఠశాలకు వెళ్లని 25 మంది పిల్లలు ఉన్నారని, వారిని పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు నచ్చచెప్పాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం ఎమ్మెల్యే స్వయంగా సిండికెట్ కాలనీలోని దేవరజాతివారి గుడిసెల వద్దకు వెళ్లి, పిల్లలు, వారి తల్లిదండ్రులను సమావేశపర్చారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తే పైసా ఖర్చులేకుండా చదువుకుంటారని, వారికి బట్టలు, పుస్తకాలను ప్రభుత్వమే ఇస్తుందని చెప్పారు. పిల్లలను బడికి పంపించే తల్లిదండ్రులకు సంక్షేమ పథకాలను ఇస్తామని హామీ ఇచ్చారు. గుడిసెల నుంచి ఆర్టీసీ కాలనీ పాఠశాల వరకు ఆటోను పెట్టి పిల్లలను తీసుకు వెళ్లి, తిరిగి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. రెండు నెలల్లో సిండికేట్ కాలనీ పరిసరాల్లో ప్రభుత్వ పాఠశాలకు భవనాన్ని నిర్మించి నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. దాంతో పిల్లలందరినీ పాఠశాలకు పంపడానికి అంగీకరించడంతో వారికి డ్రెస్సులు, పుస్తకాలను అందించారు. ఎమ్మెల్యే స్వయంగా ఆటోలో పిల్లలను ఎక్కించుకుని ఆర్టీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు ఇప్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి మాట్లాడుతూ చదువుతోనే జీవితాలు బాగుపడుతాయని స్పష్టం చేశారు. తాను కూడా గుడిసెల్లో ఉన్నానని, మా అమ్మ కూలీపని చేసి, నన్ను చదివించడంతోనే ఈనాడు ఎమ్మెల్యేను అయ్యానని వివరించారు. వీధి బాలలను గుర్తించి, వారు బడిబాట పట్టే విధంగా కృషి చేసిన ఎంఈఓ మనోహర్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, ఏ.శ్రీధర్‌రెడ్డి, నర్సింహులు, సురేష్, వెంకటయ్య, సత్యం పాల్గొన్నారు.

పనిచేసినోళ్లకే పార్టీ పదవులు

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మట్లాడుతన్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

బషీరాబాద్/ తాండూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పనిచేసినోళ్లకు పదవులు దక్కుతాయని, అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం సంస్థాగత ఎన్నికల్లో భాగంగా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త తేడా లేకుండా ప్రాధన్య క్రమంలో పదవులుంటాయన్నారు. పార్టీ బలోపేతం చేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సమావేశాల్లో చర్చించిన తర్వాతే అభ్యర్థులకు టికెట్లు ఇస్తామన్నారు. అంతకు ముందు నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయం కమాన్ నుంచి ఆలయం వరకు 1.5కిలోమీటరు రోడ్డు పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండల కార్యకర్తల సమావేశంలో రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 4న హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభను నిర్వహిస్తుందని తెలిపారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వస్తారన్నారు. పార్టీ మండల పదవులకు, నామినేటెడ్ పోస్టులకు శ్రేణులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోకుంటే మనం వండిన అన్నం ఇతరుల పాలవుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బషీరాబాద్‌లో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు ఎం.రమేష్ మాట్లాడుతూ.. పార్టీలోని ఒరిజనల్ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకపోవడం తగదని అన్నారు. సమావేశంలో ఆయన మట్లాడుతూ.. పాత నాయకులను పట్టించుకోకుండా, కొత్తవారికి పెద్దపీట వేయడం ఏమిటని ఆవేదన వెలిబుచ్చారు. కాంగ్రెస్‌ను నమ్ముకొని ఎందరో నాయకులు ఏళ్లనుంచి పనిచేస్తున్నారని, వారిని పట్టించుకోరా? అని అన్నారు. ఇటీవల పార్టీ నాయకుల అంశపై తమ దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదని ఎమ్మెల్యేనుద్దేశించి అన్నారు. ఒరిజినల్ నాయకులకు గుర్తింపునివ్వకుంటే ధర్నాకు దిగేందుకైనా సిద్ధమని హెచ్చరించారు. మనోహర్‌రెడ్డి స్పందిస్తూ.. అందరినీ కలుపుకొని పోతానని అన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు వినోద్‌రెడ్డి, నరేందర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బషీరాబాద్, తాండూరు ఏఎంసీ చైర్మన్లు జి.మాధవరెడ్డి, బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్, నాయకులు ఉత్తంచంద్, శరణుబసప్ప, రాజ్‌కుమార్, అనిల్, సుధాకర్, రాందాస్, గోపాల్, రఘునాథ్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్, శ్రీనివాస్‌రెడ్డి, శంకరప్ప, బషీరాబాద్ మండల అధ్యక్షుడు కలాల్ నర్సింహులు, రాజవర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, శంకర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అందరి సహకారంతో విధులు నిర్వహించా

- రిటైర్మెంట్ వీడ్కోలో డీఎంహెచ్‌వో వెంకటరవణ

వికారాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 8నెలలుగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సహకారంతోనే తాను సమర్థంగా పనిచేసేందుకు కృషిచేశానని డీఎంహెచ్‌వో వెంకటరవణ అన్నారు. సోమవారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా వికారాబాద్‌లోని ఓ హోటల్‌లో వేడుక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో తాను వికారాబాద్ టీబీ ఆస్పత్రిలో పనిచేశానని చెప్పారు. అతనకు అన్ని విధాలా సహకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ డీఎంహెచ్‌వో తుకారాం, డాక్టర్ రవీంద్రయాదవ్, రిటైర్డ్ డీఎంహెచ్‌వో షిండే, జీజీహెచ్ సూపరింటెండెంట్ రామచంద్రయ్య, డీసీహెచ్ఎస్ ఆనందం, పవిత్ర, జానీ, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



వెంకటరవణ దంపతులను సన్మానిస్తున్న వైద్యశాఖ అధికారులు



ఐటీఐలో డ్రెస్ మేకింగ్ ప్రదర్శన

వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో తొలిసారి డ్రెస్ మేకింగ్ ప్రదర్శన నిర్వహించారు. ఇన్‌స్ట్రక్టర్ ఉదయ్ కుమార్ శిక్షణలో విద్యార్థులు టైలరింగ్ నేర్చుకున్నారు. క్లాత్ బ్యాగులు, హ్యాండ్ బ్యాగ్స్, పిల్లో కవర్స్, కిడ్స్‌వేర్, మెన్స్‌వేర్ తయారు చేశారు. ముఖ్య అతిథిగా సోమవారం ఐఎంసీ చైర్మన్ గరిమెళ్ల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కాలానికి అనుగుణంగా ఐటీఐల్లో వివిధ నూతన ట్రేడ్లను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ నరేంద్రబాబు, టీఓ సరూష్ విద్యార్థులను అభినందించారు. ఏటీవోలు రవికుమార్, రాకేశ్, శ్రీశైలం, మథిన్, స్వాతి పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి):బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని పీసీసీ ఉపాధ్యక్షుడు టి.వజ్రేష్‌యాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కార్ పని చేస్తోందని చెప్పారు. ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పిల్లర్ల గుంతలు తీశాడు. ఇళ్ల లబ్ధిదారులు సంతోషంగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షుడు వేములు మహేశ్‌గౌడ్, మాజీ చైర్‌పర్సన్ పావని, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ముత్యాలు, రమేష్, ముల్లి జంగయ్య, మాధవరెడ్డి, అమర్, విశ్వనాథ్ రాజేందర్‌గౌడ్, యుగేందర్‌గౌడ్, ఓంప్రకాశ్, రమేష్, శ్రీనాథ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కారు టైర్ల అపహరణ



దుండగులు నాలుగు టైర్లను ఎత్తుకుపోయిన కారు

శంషాబాద్ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్ కారు నాలుగు టైర్లను అపహరించిన సంఘటన ఆదివారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్‌కు చెందిన కృష్ణాగౌడ్ నార్సింగి ట్రాఫిక్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శంషాబాద్ పరిధి శ్రీనివాస్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన తన మారుతి బెలెనో కారును ఇంటి వద్ద పార్క్ చేశాడు. సోమవారం తెల్లవారుజామున 4గంటలకు కారులో వచ్చిన ఇద్దరు దొంగలు కారు నాలుగు టైర్లు విప్పుకుపోయారు. ఉదయం గుర్తించిన కృష్ణ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా ఇద్దరు టైర్లు విప్పుకుపోయినట్టు తేలింది. టైర్ల విలువ రూ.60వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకుంటామని చెప్పారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు

షాద్‌నగర్ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రిలో అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్లను కలెక్టర్ రద్దుచేసినట్లు తహసీల్దార్ పార్థసారథి సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి నర్సింహారెడ్డి భూమిని అతడి భార్య నవనీత సహకారంతో నకిలీ జీపీఏతో మొదట శ్రీకాంత్‌రెడ్డి పేరిట, అనంతరం ఆమె కుమారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. మరో కేసులో కొత్తపల్లి సుభాన్‌రెడ్డి చిన్న కొడుకు శ్రీనివాస్‌రెడ్డి మృతితో అతడి భార్య వినోదకు వారసత్వంగా సంక్రమించిన భూమిని సుభాన్‌రెడ్డి, అతడి పెద్దకొడుకు మధుసూదన్‌రెడ్డిలు నకిలీ జీపీఏతో రిజిష్టర్ చేయించుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో విషయం బయటపడటంతో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ విచారణలో అక్రమాలు తేలడంతో రిజిస్ట్రేషన్ల రద్దుకు ఆర్డీవోకు సిఫారసు చేయగా కలెక్టర్‌కు నివేదిక పంపారు. రెండు రిజిస్ట్రేషన్లు రద్దుచేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారని తహసీల్దార్ తెలిపారు.

మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తాం



ఆరుట్లలో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ హన్మంతరెడ్డి

మంచాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి):ఆరుట్లలో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌ను త్వరలోనే రైతులకు అందుబాటులోకి తెస్తామని మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంతరెడ్డి తెలిపారు. ఆరుట్లలోని పాత పీఏసీఎస్ ప్రాంగణంలో నిర్మిస్తున్న మార్కెట్‌ను సోమవారం ప్యాక్స్ డైరెక్టర్లతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయ కూడలిలో రోడ్లపైనే కూరగాయల అమ్మకాలతో వాహనదారులకు, రైతులకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవతో పాత పీఏసీఎస్ ప్రాంగణంలోని ఖాళీస్థలంలో మార్కెట్‌కు నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటేష్‌యాదవ్, రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, బుగ్గరాములు, జంగయ్యయాదవ్, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చేవెళ్ల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్లలో మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జూలై 2, 3, 4తేదీల్లో చేపట్టనున్న 75 గంటల కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. 2024-25 విద్యా సవంత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.7,200 కోట్లు పెండింగ్‌లో ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు పాటుపడాలి



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో సీఐ గంగాధర్

కడ్తాల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి):మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్స్ సోల్జర్లుగా పనిచేయాలని కడ్తాల సీఐ గంగాధర్ అన్నారు. అన్ని గ్రామాల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపడుతూ విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సులు, వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం స్టేషన్ ఆవరణలో బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, ఏఎస్ఐ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకిచ్చిన హామీలను నేరవేర్చాలి



శాంతియుత దీక్షలో మాట్లాడుతున్న చంద్రారెడ్డి

కీసర, జూన్30(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నేరవేర్చాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కె.చంద్రారెడ్డి అన్నారు. ఉద్యకారులు నాగారం పరిధిలో సోమవారం ఒక్క రోజు శాంతియుత దీక్షచేశారు. దీక్షకు చంద్రారెడ్డి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అమరుల త్యాగం, ఉద్యమకారుల పోరాటాలను గత ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ప్రజాపాలన ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఘట్‌కేసర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కార్మికులు కమిషనర్ రాజేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు సత్కరించారు.. వారి సమస్యలను విరించారు. విలీన పంచాయతీల కార్మికులకు మున్సిపల్ కార్మికులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్మికులకు షూలు, చెప్పులు, డ్రెస్సులు, నూనె, సబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయచంద్ర, సువర్ణ, రాంచందర్, శ్రావణి, శోభ, భూపాల్, రాంకుమార్ ఉన్నారు.

ఓపెన్‌గా ఆరోగ్యం

- రూ.26 లక్షలతో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీలో ఓపెన్ జిమ్‌లు ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.26 లక్షలు మంజూరు కాగా, పట్టణంలోని ధరణి వెంచర్, కేవీఆర్ వెంచర్‌లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే వీటిని ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ తెలిపారు. పట్టణ ప్రజల వ్యాయామం కోసం జిమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలో తొలిసారిగా రెండు జిమ్‌ల ఏర్పాటుతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పార్క్‌ల ఏర్పాటుపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఓపెన్ జిమ్‌ల ప్రారంభ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్థానికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.


ఆమనగల్లులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఓపెన్ జిమ్‌లు

239వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 244వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నేతలు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్ కోరారు.



దీక్షలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. పత్తేపురం ఆల్ట్రాటెక్ కంపెనీ నుంచి రావులపల్లి కలాన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.50కోట్ల నిధులు, సంకేపల్లి గ్రామంలో రూ.55లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రమోహన్, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, పంచాయతీ రాజ్ డీఈ శ్రీధర్, ఏఈ నందకిశోర్, మండల పంచాయతీ అధికారి గిరిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, రావులపల్లి కలాన్ మాజీ ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డి, దశరథ్ తదితరులు ఉన్నారు.


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

సభను విజయవంతం చేయాలి

చేవెళ్ల: 'జై బాపు, జై భీం, జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా జూలై 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే యాదయ్య పిలుపునిచ్చారు. చేవెళ్ల క్యాంపు కార్యాలయంలో సోమవారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు.

వీఆర్‌ఏ వారసుల అరెస్ట్

కేశంపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీసీఎల్‌ఏ ముట్టడికి వెళ్తున్న కేశంపేట వీఆర్‌ఏ వారసులను సోమవారం కేశంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర శాఖ హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ ముట్టడికి కేశంపేట నుంచి వెళ్తున్న వేములనర్వకు చెందిన పల్లెమోని శ్రీరామ్, రొయ్యల కృష్ణయ్యను ఏఎస్‌ఐ శ్రీనివాస్, పీసీ శ్రీశైలంలు అరెస్ట్ చేసి కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

శంకర్‌పల్లి, జూన్30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ప్రముఖ సినీనటుడు బాలాజీ అన్నారు. చందిప్పలోని మరకత శివాలయాన్ని సోమవారం దర్శించుకున్నారు. అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌రాజు, ఆలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్, నాయకులు మోహన్ తదితరులు సినీ నటుడు బాలాజీని శాలువాతో సన్మానించి ఆలయ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

కేశంపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రైతులకు గుర్తింపు కార్డుల జారీకి చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు వివరాలు నమోదు చేసుకోవాలని కేశంపేట మండల వ్యవసాయాధికారి శిరీష అన్నారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. 2025 జనవరి 1 నాటికి పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతిఒక్కరూ వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలన్నారు. ఏఈవోలు ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తున్నారని తెలిపారు.

అల్వాలలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

కేశంపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన సమీర్ పటేల్ తన తండ్రి గులాం తాహెర్ పటేల్ జ్ఞాపకార్థం గ్రామంలో రెండు చోట్ల హైమాస్ట్ లైట్లు వేయించారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామస్తులు ఆయనను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

షాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన దాత శ్రీరాంరెడ్డి విద్యార్థులకు నోటు బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సుభాష్‌రెడ్డి, బందయ్య, నర్సింహులు, మల్లేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం తలకొండపల్లి మండలం దేవునిపడకల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులకు రూ.12 వేలతో బ్యాగులు సమకూర్చారు. సోమవారం వాటిని ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, నవీన్, జంగయ్య, సాయి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అనంతలక్ష్మి, భౌరమ్మ, తదిరులు పాల్గొన్నారు.

కడ్తాల్: స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ వాసుదేవ రావు మండలంలోని మక్తమాదారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు నోటు బుక్కులు, పెన్నులు, పెన్సిల్, క్రీడా పరికరాలను అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునిత, లక్ష్మీనారాయణ, సుభాషిణి, భార్గవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


షాబాద్: విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, తదితరులు

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

చేవెళ్ల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణ కేంద్రంలోని చంద్రారెడ్డినగర్ కాలనీలో పోచమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాలకు చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర సమతావెంకటరెడ్డి, తెలంగాణ పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల మాజీ జడ్పీటీసీ మర్పల్లి మాలతికృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గుండాల రాములు, మోహన్‌రెడ్డి, భీమయ్య, నర్సింహులు, మల్లేష్, యాదయ్య, శ్రీనివాస్‌యాద్, తదితరులు పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.


పూజలో నాయకులు



గువ్వల బాల్‌రాజ్ జన్మదిన వేడుకలు

కడ్తాల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాల్‌రాజ్ జన్మదిన వేడుకలు కడ్తాల మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జీబీఆర్ టీం అధ్యక్షుడు మహేశ్‌రాథోడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు.

ఆమనగల్లు: మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ జన్మదిన వేడుకలు ఆమనగల్లులో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదు

కందుకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమన తప్పదని, విరమణ వయస్సుకే కాని మనస్సుకు కాదని ఎంపీడీవో సరిత అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అటెంటర్‌గా బాధ్యతలు చేపట్టిన యాలాల అంజయ్య సోమవారం పదవీ విరమణ పొందాడు, ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని అంజయ్య దంపతులను సన్మానించారు.

కడ్తాల్: ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ప్రజాసేవకు పునరంకితం కావాలని కడ్తాల తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, సీడీపీవో శాంతిరేఖ అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖలో సూపర్‌వైజర్ - 1గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన భక్తశబరికి మండలంలోని మైసిగండి గ్రామంలోని ఎంఆర్‌జీ గార్డెన్‌లో సన్మాన, అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీవో సుజాత, సీడీపీవో శాంతిరేఖ హాజరై భక్తశబరిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు.

ఆమనగల్లు: ఆమనగల్లు పూర్వపు గ్రామపంచాయతీ, ప్రస్తుత మున్సిపాలిటీలో 33 ఏళ్లుగా వాటర్ లైన్‌మెన్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన ఎండీ.మొహినొద్దీన్‌కు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వపు మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్, మేనేజర్ పవన్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ, కేశవులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు: అంజయ్య దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీవో సరిత, ఎంపీవో గీత

ఎరువు.. బరువు!


(5వ పేజీ తరువాయి)

అవసరం కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ సారి పత్తి సాగు భారీగా తగ్గించారు. గతేడాదితో పోలిస్తే వరి సాగు పెంచగా, పత్తి సాగు గణనీయంగా తగ్గించారు. గత ఏడాది వానాకాలంలో వరి పంటను 1,00,608 ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించగా, ఈ ఏడాది దాన్ని 1,40,238 ఎకరాల విస్తీర్ణానికి పెంచారు. సన్నాలకు ప్రభుత్వం రూ.500 ప్రోత్సాహకం ఇస్తుండటంతో గత వానాకాలం, యాసంగి సీజన్‌లో అంచనాలకు మించి వరి సాగు చేశారు. దీంతో ఈ సారి వ్యవసాయ ప్రణాళికలో వరి సాగు లక్ష్యం గతంలో కంటే పెంచారు. దీని ప్రకారం జిల్లాలో 67,200 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటివరకు మార్క్‌ఫెడ్, సొసైటీ, ప్రైవేట్ డీలర్ల ద్వారా 14127.975 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. ఇంకా 13,399 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే స్టాక్ మిగిలి ఉంది. వర్షం పడితే ఈ స్టాక్ ఏమాత్రం సరిపోదు. ఉన్న స్టాక్‌లో డీఏపీ బస్తాలు సొసైటీ, ప్రైవేట్ డీలర్ల వద్ద మిగిలి ఉన్నాయి. మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 11 మెట్రిక్ టన్నుల డీఏపీ మాత్రమే ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన డీఏపీని బ్లాక్ మార్కెట్‌కు తరలించి స్టాక్ లేదంటున్నారు. ధరలు పెంచి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు డీఏపీ బస్తా ధర రూ.1,350 ఉండగా, డీలర్లు రూ.1,500పైగా విక్రయిస్తున్నారు. అదే విధంగా యూరియా బస్తా ధర రూ.265 ఉండగా రూ.300కు విక్రయిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు డీలర్లు చెప్పిన ధరకే డీఏపీ, యూరియాను కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటున్నారు. కేవలం యూరియానే కావాలంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. బయట ప్రైవేట్ దుకాణాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సహకార సంఘాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు ఇస్తున్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు

కొంతమంది ఫర్టిలైజర్ దుకాణాల్లో డీలర్లు డీఏపీని కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా అమ్ముతున్నారు. యూరియా 266 రూపాయలు, డీఏపీ రూ.1350 ఉంటే రూ.200 ఎక్కువగా వసూలు చేస్తున్నారు.


- కావలి రాజేందర్, ముట్పూర్, కొందుర్గు మండలం



ఎరువుల కొరత లేకుండా చర్యలు

జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. 67,200 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటి వరకు 14127.975 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశాం. ఇంకా 13,399 టన్నులు అందుబాటులో ఉంది. డీలర్లు ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు.

- నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి



కావాల్సిన ఎరువు అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

నెల	యూరియా	డీఏపీ	ఎస్ఎస్‌పీ	ఎంవోపీ	ఎన్‌పీకే	మొత్తం
ఏప్రిల్	1,200	200	50	50	800	2,300
మే	1,200	500	50	50	1000	2,800
జూన్	3,200	2,100	300	150	5,000	10750
జూలై	6,736	3,000	400	150	8,000	18,286
ఆగస్టు	7,600	2,800	100	350	8,600	19,450
సెప్టెంబర్	5,064	1,400	100	450	6,600	13,614

ఇప్పటివరకు పంపిణీ ఇలా.. (మెట్రిక్ టన్నుల్లో)

నెల	యూరియా	డీఏపీ	ఎన్‌పీకే	ఎంవోపీ	ఎస్ఎస్‌పీ	మొత్తం
ఏప్రిల్	1179.72	274.55	788.55	66.45	39.55	2348.42
మే	976.725	393.45	916.3	49.5	50.8	2386.775
జూన్	3030.75	2039.45	4132.23	62.5	127.85	9392.78
మొత్తం	5187.195	2,707.45	5836.68	178.45	218.2	14127.975

బీసీలు ఐక్యతతో ముందుకు సాగాలి

మంచాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగి రాజ్యాధికారం సాధించుకోవాలని బీసీ సమితి రాష్ట్ర నేత కటకం నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. మంచాలలో సోమవారం జరిగిన బీసీ సంఘాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీసీలు ఐక్యంగా లేకపోవడం వల్లే అభివృద్ధి ఫలాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మారోజు చారి, ఓరుగంటి శ్రీనివాస్, అశ్వాల బాల్‌రాజ్, యాదయ్య, సురేష్, మహేందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

చౌదరిగూడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి) ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువు బస్తాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లేడ్ చౌదరిగూడ ఏవో రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంతోపాటు లాల్‌పహాడ్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

చౌదరిగూడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు చెల్లించాలని సోమవారం తెలంగాణ గురుకుల కాంట్రాక్టు అసోసియేషన్ కమిటీ సభ్యులు రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు టీజీసీఏ రాష్ట్ర కార్యదర్శి సామర్థి జగన్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కూరగాయాలు, పండ్లు, చికెన్, గుడ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అదనపు కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు శ్రీనివాస్, జగన్, ఆనంద్ పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

ఆదిభట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారం మరవలేనిదని ఆదిభట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్కల పరమేశ్ అన్నారు. టీసీఎస్ కంపెనీకి చెందిన ఉద్యోగస్తులు రూ.12 వేల విలువైన సౌండ్‌బాక్స్‌లు, రూ.10 వేల విలువైన స్పోర్ట్స్ కిట్, రూ.10 వేల విలువైన వాటర్ బాటిల్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలకు టీసీఎస్ ఉద్యోగస్తుల సహకారం మరలేనిదన్నారు. టీసీఎస్ ఉద్యోగులు హర్ష, రామ్మోహన్, నవీన్, ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, భాషయ్య, రామ్మోహన్, బుచ్చయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సరికొండ యాదయ్య మృతి బాధాకరం

కేశంపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకుడు సరికొండ యాదయ్య మృతి బాధాకరమని కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు. సరికొండ యాదయ్య కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆరోగ్యం బాగా క్షీణించి సోమవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ వేములనర్వ గ్రామానికి వెళ్లి యాదయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు ఆరోపించారు. సోమవారం రాచులూరు సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జూలై 9న 34 జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన సార్వత్రిక సమ్మెలో అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ టీచర్లు శైలజ, అలివేలు, బాలమణి, సుగుణ, శమంత, రాణి, నిర్మల, బాలమణి పాల్గొన్నారు.

కుర్మిద్ద మదర్ డెయిరీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

యాచారం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మిద్ద మదర్ డెయిరీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 11 ఏళ్లుగా వరుసగా ఏకగ్రీవంగా ఎంపికవుతున్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లోనూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. లీటర్‌కు రూ.5 బోనస్ చెల్లించడానికి అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. దాణా తక్కువ ధరకు అందించాలని, పదోతరగతి, ఇంటర్ చదువుతున్న రైతుల పిల్లలకు ఆర్థికసాయమందించాలని కోరారు.

క్రైం కార్నర్

'డబుల్' లబ్ధిదారులపై కేసులు

మంచాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగంపల్లి గేటు వద్ద గల డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి అనధికార గృహ ప్రవేశాలు చేసిన లబ్ధిదారులపై కేసులు నమోదయ్యాయి. ఆర్‌అండ్‌బీ ఏఈఈ వినోద్ ఫిర్యాదుతో కేసులు నమోదు చేసినట్లు సీఐ మధు తెలిపారు. ఇక్కడి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయని, విద్యుత్, నీటి సరఫరా, డ్రైనేజీ పనులు పూర్తి చేయాల్సి ఉండగా లబ్ధిదారులు అనధికార గృహ ప్రవేశాలు చేశారని ఏఈ ఇచ్చిన ఫిర్యాదులో ఉందని తెలిపారు. గృహ ప్రవేశాలు చేసిన మొత్తం 40 మంది లబ్ధిదారులతో మాట్లాడగా 20 మంది ఇళ్లను ఖాళీచేయగా, మరో 20 మంది ఇళ్లలోనే ఉండడంతో చట్టపరమైన చర్యల కోసం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో ఇరవై మందిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నాటు సారా స్వాధీనం : వ్యక్తి అరెస్ట్

ఆమనగల్లు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల మండలాల పరిధిలో సోమవారం ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో నాటుసారాను స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పోచమ్మ గడ్డ తండా నుంచి మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి నాటు సారాను తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా వస్తున్న ఆటోను తనిఖీ చేయగా 18 లీటర్ల నాటు సారా దొరకడంతో సారాతో పాటు ఆటోను సీజ్ చేశారు. సారాను తరలిస్తున్న పోచమ్మ గడ్డ తండాకు చెందిన పాండును అరెస్ట్ చేశారు.

అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహాల చోరీ

ఇబ్రహీంపట్నం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని దండుమైలారంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అయ్యప్పస్వామి విగ్రహాలను ఎత్తుకెళ్లారు. ఊరి చివరన ఉన్న ఈ సన్నిధానంలో భక్తులు పూజించే మూడు పంచలోహ అయ్యప్పస్వామి విగ్రహాలు చోరీకి గురవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పోలీస్ అధికారులు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. చోరీ అయిన విగ్రహాల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటాయని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.